క్లుప్తంగా

నీటి పంపింగ్ వేగవంతం చేయండి



ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: జీబీసీ, హెచ్చెల్సీ నుంచి తాగు నీటి అవసరాల కోసం ఉరవకొండ నియోజక వర్గంలోని నింబగల్లు, కొనకొండ్ల సమ్మర్ స్టొరేజీ ట్యాంకులకు నీటి పంపింగ్ వేగవంతం చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కోరారు. సోమవారం ఫోన్ ద్వారా ఎస్ఈతో నీటి పంపింగ్‌పై ఎమ్మెల్సీ చర్చించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ టీబీసీ, హెచ్చెల్సీలో నీరు సమృద్ధిగా ప్రవహిస్తున్నందున అదనపు మోటార్లతో పంపింగ్ చేపట్టాలన్నారు. రాబోవు వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపేలా ప్రణాళికలు చేపట్టాలన్నారు. పంపింగ్ వేగవంతంపై త్వరలో కలెక్టర్‌ను కలసి విన్నవిస్తామన్నారు. ఇందుకు ఎస్ఈ స్పందిస్తూ అదనపు మోటార్లు ఏర్పాటు చేసి నీటి పంపింగ్ వేగవంతం చేస్తామని ఎమ్మెల్సీకి హామీ ఇచ్చారు.

చెత్త రహిత సమాజమే లక్ష్యం



కూరగాయల మార్కెట్‌లో శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: చెత్త రహిత సమాజం ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది శ్రమదానం చేపట్టారు. చైర్‌పర్సన్, కమిషనర్‌తోపాటు కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. చైర్‌పర్సన్, కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, కౌన్సిలర్లు గౌని లావణ్య, శారదాదేవి, శ్రీలక్ష్మి, పొరాళ్ల గోవిందరాజులు, ఫకృద్దీన్, డిష్ గోవిందు, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, అరవా శివప్ప, బషీర్ అహ్మద్, గోల్డ్ ఇస్మాయిల్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు




రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

బొమ్మనహాళ్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్ఐ శివను ఆదేశించారు. అలాగే స్టేషన్ పరిసరాలను పరిశీలించి సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధి నిర్వహణలో ముందుండాలన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం రాకుండా కట్టడి చేయాలన్నారు.

నేడు అవగాహన సదస్సు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఉదయం 11.30 గంటలకు విద్యార్థులకు క్రమశిక్షణ, ర్యాగింగ్, సూసైడ్ రహిత భారత్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.వీరేష్ తెలిపారు. అర్బన్ సీఐ లక్ష్మణ్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. విద్యార్థులందరూ హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రక్తదానం సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న మానవత రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి

ఉరవకొండ: రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని మానవతా రక్తదాతల సంస్థ కన్వీనర్, ప్రతిభ రాజీవ్ పురస్కార అవార్డు గ్రహీత తరిమెల అమర్నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిన్నముస్టూరు మోడల్ స్కూల్, ఉరవకొండ ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేష్ ఆధ్వర్యంలో రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ అపోహలు వీడి విద్యార్థులు రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అల్తాఫ్, వెంకట్రాముడు, వైస్ ప్రిన్సిపాల్ అరుణజ్యోతి, ముస్టూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రశస్త కుమారి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి సీఎం కృషి





విడపనకల్లు: సయ్యద్ తాజావుద్దీన్‌కు ఖాజీ నియామక పత్రం అందజేస్తున్న విశ్వ, విడపనకల్లులో ఎస్ఎస్ ట్యాంకు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

- ముస్లింల ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఉరవకొండ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ముస్లింల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం పేదలందరికీ తొలిసారిగా 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్సార్‌దేనన్నారు. ఆయన అడుగుజాడల్లోనే పదవుల నుంచి సంక్షేమ పథకాల వరకూ మైనార్టీలకు సీఎం జగన్ న్యాయం చేశారని గుర్తు చేశారు. మౌజం, ముతవల్లిలకు నెలకు రూ.15 వేలు వేతనం ఇస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తప్ప ముస్లింల సంక్షేమానికి గత టీడీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. అనంతరం విడపనకల్లు మండల ఖాజీ సయ్యద్ తాజుద్దీన్‌కు నియామకపత్రాన్ని విశ్వ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, జేసీఎస్ మండల కన్వీనర్ భరత్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బసన్న, నాయకులు కరణం భీమరెడ్డి, కొట్టాలపల్లి సర్పంచు రామాంజనేయులు, జయసింహా, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ మీరం బాషా, ఉరవకొండ, విడపనకల్లు మండల కో ఆప్షన్ సభ్యులు పామిడి సలీమ్, లతీఫ్, ఎంపీటీసీలు కాక తిమ్మరాజు, హొన్నూరు సాబ్, మత పెద్దలు సయ్యద్ సుల్తాన్ బాషా, సయ్యద్ గరీబ్ బాషా, మైనార్టీ నేత ముస్తాక్ అహమ్మద్, దస్తగిరి సాబ్, రఫిక్, సికందర్, మౌలా హుస్సేన్, నబి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి

విడపనకల్లు మండల కేంద్రంలో ఉన్న తాగునీటి ఎస్ఎస్ ట్యాంక్‌ను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సోమవారం పరిశీలించారు. ఎస్ఎస్ ట్యాంక్‌ను యుద్ధప్రాతిపదికన నీటితో నింపాలని అధికారులకు సూచించారు. తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి అదనంగా యుద్ధప్రాతిపదికన రెండు మోటార్లను ఇప్పించామన్నారు. జీబీసీ ద్వారా అందుబాటులో ఉన్న నీటిని వెంటనే సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా పూర్తిస్థాయిలో తాగునీరు ట్యాంకులోకి నింపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పవతి, జెడ్పీటీసీ హనుమంతు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బసన్న, జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, పెద్దకొట్టాలపల్లి సర్పంచ్ రామాంజనేయులు, నాయకులు భీమిరెడ్డి, సుంకన్న, గిరిబాబు, ఓబులమ్మ, హావలిగి రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధనుంజయ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోపాలకృష్ణ, ఎంపీటీసీ తిమ్మరాజు, కోఆప్షన్ మెంబర్ లతీఫ్, రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్ జలకళ' పేద రైతులకు వరం

ఉరవకొండ: పేద రైతులకు వైఎస్సార్ జలకళ పథకం ఒక వరమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఉరవకొండ మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ జలకళ కింద అర్హులైన రైతులకు మోటార్లు, పంపుసెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలోని షేక్షానుపల్లి, ఆమిద్యాల, కోనాపురం, రాచెర్ల గ్రామ రైతులకు రూ.20 లక్షల విలువైన వ్యవసాయ పంపుసెట్లు, స్టాటర్‌బాక్సులు, విద్యుత్ పరికరాలను మాజీ ఎమ్మెల్యే అందించారు. విశ్వ మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ జలకళ కింద 220 మంది చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా బోర్లు వేసి మోటార్లు అందించనట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ10కోట్ల కు పైగా ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందాచంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, కమ్మ, కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా, ఉపసర్పంచ్ వన్నప్ప, పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు ఏసీ ఎర్రిస్వామి, సుంకన్న, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు బసవరాజు, నాయకులు అశోక్, ఆసీఫ్, ఉలిగప్ప, ఓబన్నలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీ కండువా వేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

విడపనకల్లు: మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నేత సయ్యద్ సుల్తాన్ పీర్ ఖాద్రీని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కండువాను వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు మరో ఐదు ముస్లిం కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమం పథకాలు, ఆయన ఆదర్శ పాలన మెచ్చి పార్టీలోకి చేరామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యలో విప్లవాత్మక సంస్కరణలు

- అసెంబ్లీలో విప్ కాపు రామచంద్రారెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, మనబడి నాడు-నేడు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందంటూ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం శాసనసభ సమావేశంలో విప్ కాపు సుదీర్ఘంగా మాట్లాడారు. టీడీపీ హయంలో నిర్లక్ష్యానికి గురైన విద్యా రంగానికి సీఎం జగన్ జవసత్వాలు అందజేశాన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటులో ప్రత్యేక చర్యలు చేపట్టాలని దేశ అత్యున్నత న్యాయస్థానం అప్పట్లో ఉత్తర్వులు జారీచేసినా చంద్రబాబు పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే విద్య, వైద్య రంగాల్లో ఎన్నో సంస్కరణలు అమల్లోకి తీసుకొచ్చారన్నారు. మనబడి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ బడులన్నీ కార్పొరేట్‌కు దీటుగా తీర్చిద్దిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అలాగే ఆంగ్ల విద్య అమలుతో పాటు డిజిటల్ రంగం అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. రేషనలైజ్ ద్వారా విలీనమైన పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు పెంచేలా చర్యలు చేపట్టాలని సంబంధిత మంత్రికి విజ్ఞప్తిచేశారు.

నాన్‌టీచింగ్ ఉపాధ్యాయులను నియమించాలి

రాష్ట్రంలోనే రాయదుర్గం కేటీఎస్ డిగ్రీ కళాశాల రెండో అతిపెద్ద స్ట్రెంత్ ఉన్న కళాశాలగా గుర్తింపు పొందిందని విప్ కాపు తెలిపారు. అక్కడ టీచింగ్ స్టాఫ్ ఉన్నా, నాన్‌టీచింగ్ స్టాఫ్ జీరోగా ఉందన్నారు. ఆదివారం ఆ కాలేజీకి వెళ్లివచ్చానని, అక్కడ విద్యార్థులు పడే ఇబ్బందులను సభ దృష్టికి తీసుకొస్తున్నానన్నారు. కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని వాటికి సత్వర పరిష్కార మార్గం చూపేలా ఉత్తర్వులు జారీ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విప్ కాపు విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లులకు సంబంధించిన జాబితాను విప్ అందజేశారు. ఈ విషయంపై సీఎం సానుకూలత వ్యక్తం చేశారన్నారు. విప్ వెంట కాంట్రాక్టర్లు జీ సత్యనారాయణరెడ్డి, ఆర్టీ కాంతారెడ్డి, జెడ్పీటీసీ మల్లికార్జున, పార్టీ నాయకులు బొమ్మనహాళ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలవా.. పిచ్చికుక్కలా మొరగొద్దు: విప్

రాయదుర్గం: కాలవా.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై పిచ్చికుక్కలా మొరగడం మానుకోవాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన ఫోన్ ద్వారా మీడియాతో మాట్లాడారు.. నీవెంటో.. నీ బతుకేంటో తెలుసుకోవాలన్నారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన ముఖ్యమంత్రుల్లో నంబర్ స్థానంలో నిలిచిన జగన్‌పై నోటికొచ్చినట్టు మాట్లాడితే ప్రజలే బట్టలూడదీసి తంతారన్నారు. స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికిపోయిన దోపిడీదొంగ చంద్రబాబు అని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఒక్కోసారి ఒక్కోరకంగా మాట్లాడం చూస్తే పిచ్చి ముదిరినట్లు కనిపిస్తోందన్నారు. కంప్యూటర్, సెల్‌ఫోన్ కనిపెట్టాను..? ఎన్నికల్లో పోటీ చేస్తే అమెరికాలో కూడా తెలుగుదేశం గెలుస్తుంది. అమరావతిలో ఒలంపిక్స్ నిర్వహిస్తాను. బాగా ఆటలు ఆడితే నోబెల్‌ప్రైజ్ ఇప్పిస్తాను అనే మాటలు మెంటల్ కాదా..? అని ప్రశ్నించారు. బేషరతుగా రైతు, డ్వాక్రా రుణమాఫీ అన్నాడు..? ఆ మాటే చెప్పలేదని మాట మార్చాడు. ఇంటికో ఉద్యోగమన్నాడు. ఎక్కడ సాధ్యమైంది. సత్యనాదెళ్లకు ఐటీ తానే నేర్పానంటాడు. రాష్ట్రంలో నాలుగు డిగ్రీలు టెంపరేచర్ తగ్గిస్తానన్నాడు. బుర్ర లేని పప్పునాయుడుని వెంటపెట్టుకుని, కాల్వల కేసు తప్పించుకునేందుకు అధికారికంగా మెంటల్ సర్టిఫికెట్ పొందిన బాలకృష్ణతో కలసి పూటకో మాట మాట్లాడే నీచ సంస్కృతి చంద్రబాబుదని గుర్తు చేశారు. ఈ పిచ్చోళ్ల మధ్య మహా పిచ్చోడిగా పిలవబడే కాలవ శ్రీనివాసులు బుద్ధి, జ్ఞానం లేకుండా అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నాడన్నారు. వీరందరికీ తిక్క కుదిరే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే సోమవారం కూడేరులో ప్రారంభమైంది. ఎంఎల్‌హెచ్‌పీ కరిష్మా, ఏఎన్ఎం సుశీల, ఆశావర్కర్లు, వలంటీర్లు రెండు బృందాలుగా విడిపోయి ఇంటింటా వైద్య పరీక్షలు చేపట్టి యాప్‌లో నమోదు చేశారు. ఆరోగ్య సమస్యలున్న వారికి వచ్చే నెల 10న సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు.

జంబుకేశ్వరాలయంలో విశేష పూజలు



పూల అలంకరణలో జంబుకేశ్వరుడు



అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభు జంబుకేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. పూలతో అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అర్చకుడు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు స్వామికి విశేష పూజలు, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమ అర్చన, మంగళనైవేద్యాలు నిర్వహించారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో స్వామికి అభిషేకం చేసి, మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున తులసీ మాలధారణకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు.

వలంటీర్ల సేవలు కేశవ్‌కు కనిపించడం లేదా ?



వజ్రకరూరు: నిరసన తెలుపుతున్న వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు



విడపనకల్లు: పయ్యావుల కేశవ్ తీరుపై మండిపడుతున్న వలంటీర్లు, ప్రజాప్రతినిధులు

వజ్రకరూరు/విడపనకల్లు: ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలను నిస్వార్థంగా ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్ల సేవలను ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తక్కువ చేసి మాట్లాడటం సబబుకాదని, వెంటనే ఆయన ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం వజ్రకరూరు మండల కేంద్రంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ వలంటీర్లను కించపరిచేలా మాట్లాడిన తీరును వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. వారికి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సంఘీభావం తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు చేతపట్టుకుని ర్యాలీగా పయ్యావుల కేశవ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బస్టాండ్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. వైఎస్సార్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు కేశవ్ వాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వలంటీర్లకు కేశవ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు స్కిల్ స్కాంను తప్పుదోవ పట్టించడానికే కేశవ్ వలంటీర్లపై విషం చిమ్ముతున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు ఉస్మాన్, రఘుపతి, సర్పంచు భూమా కమలమ్మ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చంద్రానాయక్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ప్యాపిలి వీరాంజి, ఆలయ కమిటీ మాజీ సభ్యుడు నారాయణ, ఎస్సీసెల్ కార్యదర్శి ప్రభుదాస్, యువజన విభాగం నాయకుడు రాగుల పాడువీరా తదితరులు పాల్గొన్నారు. అలాగే తమపై టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు క్షమాపణలు చెప్పాలని విడపనకల్లు మండలంలోని వలంటీర్లు నిరసన తెలిపారు. వారికి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ కేశవ్ మొదట వలంటీర్ అనే పదానికి అర్థం తెలుసుకుని మాట్లాడాలని సూచించారు.

గ్రామైక్య సంఘాల ఆడిటింగ్

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ మహిళా మండలి సమైక్య కేంద్రంలో 42 గ్రామైక్య సంఘాల రికార్డులను ఆడిటింగ్ అధికారులు తనిఖీ చేశారు. ఆడిటర్ నబీరసూల్, ఓబులేశు, రామరాజు రికార్డులు, నగదురహిత లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ గంగాధర, ఏపీఎం కళానాయక్, సీసీ, ఆనిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

బొమ్మనహాళ్: చదవుతో పాటు క్రీడల్లో రాణించాలని దేవగిరి సర్పంచ్ రాధిక సూచించారు. మండలంలోని దేవగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాల్ బ్యాట్మింటన్ నియోజకవర్గ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంసీహెచ్ రాజ్‌కుమార్‌తో కలసి సర్పంచ్ రూ.10 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, పీఈటీ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

కుందుర్పి: పూలే గురుకుల బాలుర పాఠశాల భవన నిర్మాణాలు కుందుర్పిలోనే నిర్మించాలని కోరుతూ స్థానిక పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. మంత్రి ఉషశ్రీ చరణ్ చొరవతో పాఠశాల భవన నిర్మాణాల కోసం రూ.25 కోట్ల నిధులు మంజూరు కావడం తెలిసిందే. కాగా మండల కేంద్రానికి 20 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఎనుములదొడ్డిలో పాఠశాల భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టిన తరుణంలో కుందుర్పి పరిసర ప్రాంతాల్లోనే పాఠశాలను నిర్మిస్తే అనుకూలంగా ఉంటుందని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్పందనకు గైర్హాజరు

కూడేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి తహసీల్దార్ శేషారెడ్డి, ఏపీఎం రాజశేఖర్, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కాంతమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రాజేశ్వరి, అరుణ మాత్రమే హాజరయ్యారు. దీంతో హౌసింగ్, వ్యవసాయ శాఖతో పాటు మరికొన్ని శాఖల అధికారులకు తహసీల్దార్ ఫోన్ చేసి మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశాలున్నాయి. మీరేమో హాజరవడం లేదు. ప్రతి వారం «స్పందన»కు రమ్మని ఫోన్ చేసి చెప్పాలా? ఇలాగైతే ప్రజా సమస్యలు ఎలా పరిష్కారవుతాయి అని క్లాస్ తీసుకున్నారు. దీంతో కొన్ని శాఖల అధికారులు 12 గంటల తర్వాత హాజరయ్యారు. ప్రజల నుంచి తహసీల్దార్ అర్జీలు స్వీకరించారు.

ఉపాధి పనులపై సమీక్ష

బ్రహ్మసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏపీడీ రమేష్‌నాయక్ ఉపాధి పనుల నిర్వహణ, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలో చేపట్టిన పనుల వివరాలు, కూలీల సంఖ్య తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇంకుడు గుంతలు తవ్వించాలని, డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్లతోటలు సాగుచేసిన రైతులకు సకాలంలో బిల్లులు అందేలా చూడాలన్నారు. అనంతరం ఇంకుడు గుంతలు, ఫారంపాండ్లను ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ దాసానాయక్, జేఏసీ జయప్రకాష్, ఏపీఓ అవినాష్, టెక్నికల్ అసిసెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలాలివ్వాలి

కూడేరు: అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలిచ్చి, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలతో కలసి ధర్నా చేపట్టారు. బ్రాహ్మణపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబర్ 11లో గల 9 ఎకరాల్లో, 44-1లో గల 2 ఎకరాల్లో పేదల ఇళ్ల స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో భూ ఆక్రమణ చేశామన్నారు. అధికారులు విచారణ చేపట్టి పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. అలాగే వర్షాభావంతో దెబ్బతిన్న పంటలను అంచనా వేసి రైతులకు పరిహారం అందించాలన్నారు. ఈ మేరకు తహసీల్దార్ శేషారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమణ, మల్లికార్జున, రమణ, సంగప్ప, గోపాల్, మనోహర్, శ్రీరాములు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

27న 'జగనన్నకు చెబుదాం'

కణేకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఈనెల 27న కలెక్టర్ గౌతమి నేతృత్వంలో కణేకల్లులో నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రజాక్‌వలి సోమవారం తెలిపారు. రామనగర్‌లోని కేసీఎస్ఆర్ ఫంక్షన్‌హాలులో బుధవా రం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమస్యలుంటే కలెక్టర్ దృష్టికి తీసుకోరావాలని మండల ప్రజలకు సూచించారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వివిధ వార్డుల్లో ఖాళీగా ఉన్న 16 వలంటీర్ పోస్టులకు ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. అర్హత, ఆసక్తి గల వారు ఈ నెల 30లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టణంలోని 1, 3, 5, 6, 7, 10, 11, 12 సచివాలయాల పరిధిలోని 1, 2, 5, 7, 10, 16, 17, 18, 19, 20 వార్డుల్లో 16 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు గల యువతీ యువకులు httpr://frwrvounsreer.apcffr.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు

కంబదూరు: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలను అందిస్తామని వైద్యాధికారి ఆసియా తెలిపారు. సోమవారం మండలంలోని కదిరిదేవరపల్లిలో 104 వాహనం ద్వారా 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

సంక్షిప్త సమాచారం

నేడు మారెమ్మ జాతర

కుందుర్పి: మండలంలోని బసాపురం, ఎర్రగుంట, మలయనూరు పంచాయతీల పరిధిలోని 10 గ్రామాల్లో మంగళవారం మారెమ్మ జాతర నిర్వహించనున్నారు. ఉదయం అమ్మవారి గ్రామోత్సవం, కుంకుమార్చన, గ్రామశాంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచులు గోవిందమ్మ, విశాలాక్షి, మమత తెలిపారు. జాతర సందర్భంగా వడ్డెపాళ్యంలో సోమవారం సాయంత్రం మారెమ్మ గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది.

మిశ్రమ పంటల సాగుతో లాభాలు

కుందుర్పి: మిశ్రమ పంటలతో ఆశించిన లాభాలు సాధించవచ్చని వ్యవసాయ అధికారి మహేష్, ఆ శాఖ కో-ఆర్డినేటర్ శివశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని మహంతపురం, మలయనూరు పంచాయతీల్లో ఏపీ సీఎన్ఎఫ్ సంస్థ పర్యవేక్షణలో ఉలువ, రాగి, అలుసంద, పెసర విత్తనాలను రైతుల సమక్షంలో వర్షాధార పంటగా సాగు చేయించారు. అలాగే ఆర్‌బీకేల్లో చిన్న, సన్నకారు రైతులకు వర్షాధారం కింద సాగుచేసేందుకు కిలో ఉలవలు రూ.22తో 25 కిలోల వరకూ అందజేస్తామన్నారు.

సమస్యలు సకాలంలో పరిష్కరించాలి



స్పందన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ దివాకరర్డి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలో స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో భాగంగా వచ్చిన అర్జీలపై అశ్రద్ధ వహించకుండా సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని మున్సిపల్ కమిషనర్ సచివాలయ సిబ్బందికి సూచించారు. సోమవారం స్పందన కార్యక్రమం అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. పట్టణంలోని సచివాలయాల్లో ఏవైనా అర్జీలు వస్తే వాటిని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసి లబ్ధిదారులకు వివరాలు అందజేయాలన్నారు. సమస్య తీవ్రత ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆర్టీసీ బస్సు, బైకు ఢీ

కళ్యాణదుర్గం: పట్టణంలో సోమవారం ఆర్టీసీ బస్సు, బైకు ఢీ కొన్నాయి. వివరాలు.. ఉరవకొండ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు కళ్యాణదుర్గం బస్టాండ్ నుంచి కొద్ది దూరం రాగానే గాంధీ సర్కిల్ సమీపంలో ముందు వైపు వెళ్తున్న పల్సర్ బైకును ఢీ కొంది. డ్రైవర్ వెంటనే బ్రేకు వేయడంతో పెను ప్రమాదం తప్పింది. యువకుడు బైకు వదిలి పక్కకు వెళ్లడంతో ఎలాంటి గాయాలు కాలేదు. అనంతరం స్థానికులు బైకును పక్కకు తీశారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోండి

కుందుర్పి: ఖరీఫ్‌లో వర్షాధార పంటలు సాగుచేసిన రైతులు ఈ నెల 30 లోపు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి మహేష్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 10 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటికే 80 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. మిగిలిన రైతులు వెంటనే ఎంపీఈఓలను సంప్రదించి ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయించుకోవాలన్నారు.